క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



నారాయణపురంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాద్

దెందులూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాద్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం నారాయణపురం క్యాంపు వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఉంగుటూరు, దెందులూరు ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, కొఠారు అబ్బయ్యచౌదరి వారితో పాటు ఉన్నారు.

సివిల్స్ ర్యాంకర్ ప్రత్యూష యువతకు స్ఫూర్తి

దెందులూరు: ఏ రంగంలోనైనా క్రమశిక్షణ, సత్ప్రవర్తన, నిరంతర సాధనతోనే ఎంచుకున్న లక్ష్యాలు సాధించవచ్చని చిన్న వయస్సులో సివిల్స్‌లో 198 ర్యాంకు సాధించి సత్తాచాటిన భానుశ్రీ ప్రత్యూష యువతకు స్ఫూర్తిదాయకమని గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగ మల్లేశ్వరి కుమార్ అన్నారు. బుధవారం ఏలూరులో సివిల్స్ ర్యాంకర్ భానుశ్రీ ప్రత్యూషను కలిసి అభినందించినట్టు సర్పంచ్ తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ (గ్రూప్-1)గా దెందులూరు మండల ఆడుదాం- ఆంధ్ర ప్రత్యేక అధికారిగా ఇటీవల ప్రత్యూష పని చేశారని, ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ఆమె చూపిన చొరవ, ప్రణాళిక తనకు ఎంతో నచ్చిందన్నారు. భవిష్యత్తులో భానుశ్రీ ప్రత్యూష మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని సర్పంచ్ ఆకాంక్షించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: వేసవి నేపథ్యంలో నిర్వహణలో భాగంగా పెదతాడేపల్లి 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉంగుటూరు, ఎర్రమళ్ల, చేబ్రోలు, 33/ 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఉంగుటూరు, నాచుగుంట, నీలాద్రిపురం, చేబ్రోలు, కైకరం, గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీరామ్ తెలిపారు. ఆయా గ్రామాల్లోని పరిశ్రమలకు, గృహాలకు ఈనెల 18 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. 19న నారాయణపురం, బాదంపూడి, వెల్లమిల్లి సబ్‌స్టేషన్లు పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శ్రీరామ్ తెలిపారు. ఈ కారణంగా బాదంపూడి, వెల్లమిల్లి, చిన్న వెల్లమిల్లి, ఉంగుటూరు, నారాయణపురం, కొత్త ఉంగుటూరు గ్రామాలకు విద్యుత్ ఉండదని ఏఈ వివరించారు.

పెదపాడులో..

పెదపాడు: పెదపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని రాళ్లపల్లివారి పాలెం ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్) నజరాజన్ తెలిపారు. పెదపాడు మండలంలోని నూతన లైన్లు నిర్మాణం, లైన్లు మరమ్మత్తుల నిమిత్తం ఈనెల 18 నుంచి 20 వరకు మూడు రోజుల పాటు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఫీడర్ పరిధిలోని ఖాజీగూడెం, గుడిపాడు, సత్యవోలు, రాళ్లపల్లి వారి పాలెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు.

ప్రమాదాల నివారణపై అవగాహన



భీమడోలులో అపార్ట్‌మెంట్‌లో మంటలను ఆర్పుతున్న సిబ్బంది

భీమడోలు: మహిళలు గ్యాస్ సిలిండర్, స్టౌ ఉపయోగించి వంట చేసే సమయంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం రాత్రి భీమడోలు అగ్నిమాపక శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక అధికారి జి.నాగరాజు ఆధ్వర్యంలో భీమడోలులోని అపార్ట్‌మెంట్‌లోని మహిళలకు ప్రమాదాలు, వాటి నివారణ, ముందుస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించి వారికి అనుమానాలను నివృత్తి చేసారు. గ్యాస్ సిలిండర్, స్టౌ నుంచి మంటలు వస్తే వాటిని ఏవిధంగా ఆర్పాలో వారికి వివరించారు. వంట పూర్తి కాగానే వెంటనే రెగ్యులైటర్, పొయ్యిలను ఆర్పుకోవాలని సూచించారు. మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

హిమోఫిలియాపై అవగాహన

ఏలూరు (టూటౌన్): ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం సందర్భంగా జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ హిమోఫిలియా అనేది ఒక అరుదైన రుగ్మత అన్నారు. రక్తం సాధారణ పద్ధతిలో గడ్డకట్టదని చెప్పారు. ఇది అబ్బాయిల్లో సంభవిస్తుందని, తల్లి జన్యువుల్లో ఒకదాని ద్వారా తల్లి నుంచి కొడుకుకు వ్యాపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సిబ్బంది, డీడీఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

- వాడవాడలా ఘనంగా వేడుకలు
- గుండుగొలనులో ముత్యాల తలంబ్రాలు పోసి కల్యాణ తంతు

భీమడోలు: రాములోరి కల్యాణం బుధవారం వాడవాడలా వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆలయాల్లో నిర్వహించిన సీతారామస్వామి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. శ్రీరామ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉత్సవ పందిళ్ల వద్ద స్వామి, అమ్మవార్ల కల్యాణాలు వైభవంగా నిర్వహించారు. గుండుగొలను, భీమడోలు, వడ్లపట్ల, పోలసానిపల్లి, పూళ్ల, సూరప్పగూడెంలో సీతారామస్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల వేడుకగా నిర్వహించారు. వడపప్పు, పానకాలను స్వామి వార్లకు నేపథ్యాలు సమర్పించారు. ప్రసిద్ధి గాంచిన గుండుగొలనులోని సీతారామ స్వామి కల్యాణోత్సవాలు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగారాజ్‌కుమార్ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. భద్రాద్రిలో రాములోరికి కల్యాణం నిర్వహించే శుభ గడియాల్లో ఇక్కడ కల్యాణోత్సవం నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగిస్తున్నారు. మేళ తాళాలతో సుందరంగా ముస్తాబైన స్వామి, అమ్మవార్లకు శోభాయాత్ర నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కల్యాణోత్సవం మధ్యాహ్నం 12 గంటలకు స్వామి, అమ్మవార్లకు ముత్యాలు పోశారు. పానకాలు, నివేదన, హారతులు పట్టి కల్యాణ తంతును పూర్తి చేసారు. గ్రామానికి చెందిన దంపతులు పీటలపై ఆశీనులయ్యారు. రాత్రి గరుడోత్సవంలో స్వామి ఊరేగారు. గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ట్రస్టీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు ఆధ్వర్యంలో ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు పర్యవేక్షణలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాత్రి హనుమ వాహనంలో వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. పూళ్లలోని మండపాల వద్ద సీతారామస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. వడ్లపట్లలో రామాలయంలో, భీమడోలు జంక్షన్ ప్రాంతంలోని సీతారామచంద్ర స్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణం కన్నుల వేడుకగా నిర్వహించారు.



భీమడోలు: గుండుగొలను ఆలయంలో మంగళ సూత్రాలను భక్తులకు చూపుతున్న అర్చకులు



పెదపాడు: గండిచెరువు గట్టులోని సీతారామ స్వామి



గణపవరం: స్థానిక బస్టాండు వద్ద రామాలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

గణపవరం: గణపవరంలోని బస్టాండు వద్ద ప్రసిద్ధ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ సలాది నరేష్ దంపతులతో పాటు పలువురు దంపతులు పూజలో పాల్గొని సీతారాముల కల్యాణం జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసుల సుబ్రహ్మణ్యం పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని కల్యాణం తిలకించారు. ఆలయం వద్ద పానకాలుపోసి, ప్రసాద వితరణ చేశారు. గణపవరం వెలంపేట, సరిపల్లె, కొమ్మర, అర్ధవరం, పిప్పర, చిలకంపాడు, కాశిపాడు, కేవవరం, జల్లికాకినాడ, కొందేపాడు, మొయ్యేరు, ముప్పర్తిపాడులో శ్రీరామ నవమి వేడులు వైభవంగా నిర్వహించారు.



భీమడోలు: గుండుగొలనులో సీతారామస్వామి ఆలయంలో ముత్యాల తలంబ్రాలు పోస్తున్న అర్చకులు



భీమడోలు: పూళ్లలో మండపాల వేదికపై గరుడ వాహనంపై కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం

దెందులూరు: శ్రీరామనవమి వేడుకలు మండలంలో గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్ని రామాలయాలకు రంగులు వేసి, విద్యుద్దీపాలంకరణ చేశారు. ఆలయ అర్చకులు తిరుమల తిరుపతి దేవస్థానం నిర్దేశించిన ముహూర్తానికి సీతారాముని కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దెందులూరు యాదవుల వీధిలో రామాలయంలో వీఆర్వో రంగనాథ్ కుటుంబ సభ్యులు భక్తులకు ప్రసాదం, పానకం అందజేశారు.



పెదపాడు: సత్యవోలులో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ



దెందులూరు: స్థానిక యాదవుల వీధిలో రామాలయం వద్ద పానకం పంపిణీ చేస్తున్న వీఆర్వో రంగనాథ్

రామాలయాల్లో ప్రత్యేక పూజలు

పెదపాడు: మండలంలోని పలు రామాలయాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు, సీతారామ స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పెదపాడు తెలగాలపేట రామాలయంలో, నాయుడుగూడెం కేవీకే పురం రామాలయంలో, గండిచెరువుగట్టు రామాలయంలో కొత్తూరు రామాలయంలో, సత్యవోలు రామాలయంలో రామయ్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. గండిచెరవుగట్టు గ్రామంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు పరాంకుశం చక్రధర శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి కల్యాణం నిర్వహించారు.



భీమడోలు: గుండుగొలను వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని హనుమ వాహనంలో ఊరేగిస్తున్న దృశ్యం

సత్యవోలులోని రామాలయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహించారు. వారితోపాటు పలువురు భక్తులు పాల్గొని కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

సీఎం జగన్ నాయకత్వంలో ఆదర్శవంతమైన పాలన

దెందులూరు: రానున్న రోజుల్లో రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా దెందులూరు నియోజకవర్గాన్ని తీర్చిదిద్దేందుకు పార్టీ శ్రేణులు, ప్రజల సహాయ సహకారాలతో కృషి చేస్తానని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం రాత్రి పోతునూరులో గాంధీ బొమ్మ సెంటరులో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో నియోజకవర్గంలో గణనీయంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. కుల, మతం, వర్గం, ప్రాంతం, పార్టీ అనే బేధం లేకుండా లంచాలు లేకుండా ఆదర్శవంతమైన పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అమలైందన్నారు. పోతునూరు, కేదవరం, దెందులూరు గ్రామాల్లో టీడీపీ కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిన కార్యక్రమానికి నేతృత్వం వహించిన నాయకులందరినీ పేరుపేరున ఎమ్మెల్యే అభినందించారు. దెందులూరు నియోజకవర్గ పరిశీలకులు, టీటీడీ బోర్డు మెంబరు నెరుసు రాంబాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రత్యేక కృషి, చొరవ తీసుకుంటారన్నారు. సమష్టి కృషితో రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా అబ్బయ్యచౌదరిని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ పార్టీ ఖాళీ అవుతుందన్నారు. 19న ఎమ్మెల్యే నామినేషన్ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. గాంధీబొమ్మ సెంటరులో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, పార్టీ పరిశీలకులు నెరుసు రాంబాబు ప్రారంభించారు.

ఘన స్వాగతం: పోతునూరు విచ్చేసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉండ్రాజవరం అడ్డరోడ్డు నుంచి పార్టీ జెండాలు, తీన్మార్, నృత్యాలతో పాటు అర కిలోమీటర్ల మేర పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విజయవాడ కనకదుర్గమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, సీనియర్ నాయకులు పీవీ రావు, ఊదరగొండ చంద్రమౌళి, చలమోలు అశోక్‌గౌడ్, ఎంపీటీసీ సున్నా నరేష్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు తలారి రామకృష్ణ, పార్టీ నాయకులు బీశెట్టి నూకరాజు, బత్రాజు సత్యనారాయణ, బుద్దా కృష్ణార్జున, రమేష్, సున్నా ఫణీంద్ర, వాసే డొమినిక్‌తో పాటు మండలంలో అన్ని గ్రామాల సర్పంచులు హాజరయ్యారు.

ముగిసిన వసంత నవరాత్రి ఉత్సవాలు

గణపవరం: గణపవరం మండలం సరిపల్లె టీటీడీ కల్యాణ మండపం వేద పాఠశాలలో గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 104వ వసంత నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఏటా ఉగాది రోజు ప్రారంభమై ఈ ఉత్సవాలు శ్రీరామ నవమి వరకూ కొనసాగుతాయి. ప్రతి రోజూ ఐదుగురు దంపతులు పీటలపై కూర్చుని దేవతామూర్తుల స్వర్ణ విగ్రహాలకు పూజలు చేశారు. బుధవారం సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. గణపవరం పరిసర గ్రామాలకు చెందిన మూడువేల భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు కె.సూర్యనారాయణ, కెసత్యనారాయణమూర్తి, కె.సుబ్బరాజు, కె.విశారద తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



సరిపల్లె వేద పాఠశాలలో వసంత నవరాత్రి పూజలు చేస్తున్న భక్తులు

పూజల అనంతరం స్వామివార్ల పవళింపు సేవ నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. రెండు వేలకుపైగా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివార్ల తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం

- జోష్ నింపిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర
- ప్రజలు, కార్యకర్తలతో మమేకమైన సీఎం జగన్

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం జగన్ బస్సు యాత్ర పార్టీ శ్రేణులకు ఉత్సాహాన్నిచ్చింది. తమ అభిమాన నాయకుడు ఉంగుటూరు నియోజకవర్గానికి రావడంతో పెద్ద ఎత్తున ఆయా గ్రామాల సెంటర్లకు పెద్ద ఎత్తున ప్రజలు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, వికలాంగులు సైతం పెద్ద ఎత్తున తరలిరావడం విశేషం. రెండురోజులపాటు ఉంగుటూరు నియోజకవర్గంలో సీఎం జగన్ బస్సు యాత్ర కొనసాగింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మేమంతా సిద్ధం బస్సు యాత్ర గుండుగొలను, బీమడోలు, పూళ్ల, కైకరం, చేబ్రోలు, నారాయణపురం చేరుకుంది. సోమవారం రావులపర్రు, రాచూరు, శీతారామపురం, నిడమర్రు, మందలపర్రు, బావాయిపాలెం, గణపవరం , సరిపల్లె మీదుగా నియోజకవర్గంలో బస్సు యాత్ర నిర్వహించారు. ఈక్రమంలో సీఎం జగన్ చాలా ఓపికతో ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులతో అక్కడక్కడ మాట్లాడి వారిని ఉత్సాహపర్చారు. జగన్ రాకముందు రెండు గంటలకు భీమడోలు మండలం లంకగ్రామాల నుంచి పెద్ద ఎత్తున వయస్సులతో సంబంధం లేకుడా గుండుగొలను మీదుగా ట్రాక్టరు, ఆటోలపై మహిళలు, వృద్ధులు చేరుకుని వారు తమ అభిమాన నాయకుడు వస్తుండటంతో ఆనందంతో డ్యాన్సులు చేశారు. పూళ్ల, కైకరం, నాయణపురంలో సీఎం జగన్‌ను చూసేందుకు వేలాదిగా ప్రజలు సెంటరుకు చేరుకున్నారు. రీ జగన్ బస్సు పైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. రాచూరు, నిడమర్రు, గణపవరం సెంటర్లో మండుటెండను సైతం లెక్కచేయకుండా జనం తమ అభిమాన నాయకుడు వైఎస్ జగన్‌ను చూసేందుకు వేలాదిగా తరలి రావడంతో పార్టీ కార్యకర్తలను ఉత్తేజపరిచింది. ఉంగుటూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సీఎం జగన్ బస్సు యాత్ర కొనసాగడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.



గుండుగొలను సెంటర్‌లో నృత్యం చేసున్న కొల్లేరు వాసులు (ఫైలు)



పూళ్ల సెంటర్లో కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



నారాయణపురంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

నామినేషన్ల స్వీకరణకు రంగం సిద్ధం

ఉంగుటూరు: నేటి నుంచి ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలు వరకు అసెంబ్లీ ఎన్నికల నామినేషన్లను స్వీకరించనున్నట్టు ఉంగుటూరు ఎన్నికల రిటర్నింగు అధికారి ఖాజావలి వెల్లడించారు. బుధవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఖాజావలి మాట్లాడుతూ 18వ తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు తీసుకుంటామని తెలిపారు. 25న మధ్యాహ్నం 3గంటలకు నామినేషన్లు ఎంతమంది వచ్చినా ఆ సమయానికి ఉన్న వారి నుంచి నామినేషన్లు స్వీకరించే అవకాశం ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. సంబంధిత పత్రాలు పూర్తి చేసేందుకు, అనుమానాలు నివృత్తి చేసేందుకు హెల్ప్ డెస్కు ఏర్పాటు చేశామని వివరించారు. ఆర్వో కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. నియోజకవర్గంలో 2,05,334 మంది ఓటర్లున్నారని వెల్లడించారు. 214 పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆర్వో ఖాజావలి వివరించారు. సహాయ ఎన్నికల అధికారి శివయ్య పాల్గొన్నారు.



ఆర్వో ఖాజావలి

కాంగ్రెస్‌కు ముత్యాల బాలాజీ రాజీనామా

ఉంగుటూరు: కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు ముత్యాల బాలాజీ ఆ పార్టీకి బుధవారం రాజీనామా చేశారు. కాంగ్రెస్‌లో మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ అనుయాయుడు అయిన బాలాజీ ఆ పార్టీలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, ఉంగుటూరు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారు. పార్టీ తీరు నచ్చక రాజీనామా చేసినట్టు తెలిపారు.

ప్రతి హామీనీ నెరవేర్చిన సీఎం జగన్

భీమడోలు: రానున్న ఎన్నికల్లో ఉంగుటూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పోలసానిపల్లిలో ఒకటి, రెండవ వార్డుల్లో బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారం చేసారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే వాసుబాబు, సునీల్ యాదవ్‌ను గెలిపించాలని సర్పంచ్ షేక్ రహీమబేగం హసేనా, ఉపసర్పంచ్ అంబటి దేవి ప్రసాద్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని, రానున్న రోజుల్లో పేద కుటుంబాలకు మరింత మేలు చేసే పథకాలు అమలు చేస్తారని అన్నారు. ఇటీవల పార్టీలో చేరిన వారు వారితో కలిసి విస్తృతంగా ప్రచారం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ జాయింట్ కార్యదర్శి అంబటి నాగేంద్ర ప్రసాద్, వార్డు సభ్యులు పాకిరం శ్రీనివాసరావు, అనంతమ్మ, బొద్దాని స్వామి, మాజీ ఎంపీటీసీ కోట శంకర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాకిన సత్యనారాయణ, నాయకులు కోట బంగారయ్య, పీవీ లక్ష్మీనారాయణ, మంచెం నాగేశ్వరరావు, మద్దాల జయమ్మ, విల్సన్, సత్యనారాయణ చౌదరి, మామిడి అప్పారావు, కనుమూరి బాపిరాజు, గేవాడ సుబ్రహ్మణ్యం, కోట శ్రీనివాసరావు, పొందూరి మంగపతి, చెరుకూరి హనుమంత్ పాల్గొన్నారు.



పోలసానిపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు